క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు




ఆలయం వెలుపల సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్

తిరుమల: తిరుమల శ్రీవారిని సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



సూచనలు చేస్తున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పక్కగా ఏర్పాట్లను చేస్తున్నట్లు చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రకాశం జిల్లా నుంచి సుమారు 67 మంది పోలీసులు బందోబస్తు నిమిత్తం చంద్రగిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం సాయంత్రం దిశానిర్దేశం చేశారు. తిరుమల బ్రహ్మోత్సవాలను తిలకిచేందుకు శ్రీవారిమెట్టు మార్గంలో అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన తిరుమలకు వెళ్తుంటారన్నారు. ఈ క్రమంలో శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు ప్రాంతాల్లో బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లను టీటీడీ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుధాకర్, హెచ్‌సీ బాలకృష్ణ, పీసీలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు సారె



ముత్యాలమ్మకు సారె తీసుకెళ్తున్న గ్రామస్తులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలో గల శ్రీశక్తి పీఠంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి రాయలచెరువుపేట గ్రామస్తులు బుధవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వారు 108 కలశాలతో వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


క్రీడల్లో వైద్యవిద్యార్థుల ప్రతిభ



ధ్రువపత్రాలను అందిస్తున్న ఐఐటీ అధికారులు

తిరుపతి తుడా: తిరుపతి ఐఐటీ వేదికగా గత ఐదు రోజులుగా జరుగుతున్న ఇంటర్ కాలేజ్ గేట్స్ క్రీడల్లో ఎస్వీ వైద్య కళాశాల యూజీ విద్యార్థులు ప్రతిభ కనబరచి గోల్డ్, సిల్వర్, బ్రౌన్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు క్రీడల్లో పలు విభాగాల్లో నైపుణ్యతను కనబరిచిన పథకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, ఫిజికల్ డైరెక్టర్ శరవణన్, వైద్య కళాశాల వైద్య, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి



సిద్ధమ్మ (ఫైల్)


భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం కొటబైలు పంచాయతీ తురకపల్లె అంగన్‌వాడీ టీచర్ సిద్ధమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతి పంచాయతీకి తీరని లోటు అని స్థానిక సర్పంచ్ రెడ్డెమ్మ తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాషిణి, అంగన్‌వాడీ టీచర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

తిరుపతి తుడా: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలోని అనాథ బాలికలకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిత్యావసర సరుకులు అందజేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా రూ.25 వేల విలువైన వస్తువులను వితరణ చేశారు. కార్యక్రమంలో జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి, తిరుపతి ఫిల్మ్ సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు బాబు, పాఠశాల కార్యదర్శి సాకం కృష్ణమూర్తి, వార్డెన్ హేమ పాల్గొన్నారు.





బ్రహ్మోత్సవ శోభ..

దసరా బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి, తిరుమలను శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. తిరుపతిలోని నంది సర్కిల్, తిరుమలలోని మాఢవీధుల్లో దేవతామూర్తుల కటౌట్లు విద్యుత్ వెలుగుల నడుమ కాంతులీనుతున్నాయి. - తిరుమల



నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: నగరానికి చెందిన అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్ కుమారుడు సాయియాదవ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీటీడీ మాజీ చైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి మృతుడికి నివాళులర్పించారు. అనంతరం మునికృష్ణయ్యయాదవ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

నేటి నుంచి దశ మహా దివ్యోత్సవాలు



మాట్లాడుతున్న శ్రీశక్తిపీఠం ఆర్గనైజర్ సుధామయి

తిరుపతి కల్చరల్: తిరుపతి రూరల్, రాయలచెరువు వద్ద వెలసిన శ్రీశక్తిపీఠంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 3వ తేదీ గురువారం నుంచి 12వ తేదీ వరకు శ్రీ దశమహా విద్యాదివ్యోత్సవాలు అత్యంత వేడుకగా చేపడుతున్నట్లు శ్రీశక్తి పీఠం ఆర్గనైజర్ సుధామయి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్మాత తన భక్తులను కాపాడడం కోసం దశ మహావిద్యాదేవతల రూపాలు తీసుకుని రాక్షస సంహారం చేసిన రోజును దసరాగా జరుపుకుంటున్నామని తెలిపారు. అలాంటి దశ మహా విద్యావేదత అలంకరణలతో కూడిన దేవతలు వెలసిన దేశంలోని ఏకైక క్షేత్రం శ్రీశక్తి పీఠమని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు, శ్రీవారాహి ప్రత్యంగిరా సహిత శక్తికాళీ దేవిహోమం, స్త్రీమూర్తులకు సువాసిని పూజలు చేపడుతున్నట్లు తెలిపారు. 9వ తేదీన మూలానక్షత్రం రోజున వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సమావేశంలో శక్తి సేవాసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత మాస్టర్లదే

– జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ శేఖర్



గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఈఓ శేఖర్

చంద్రగిరి(తిరుచానూరు): ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేసి, విద్యార్థులకు చిన్నతనం నుంచే సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి ఉన్నత విలువలు అలవరించేందుకు స్కౌట్స్ మాస్టర్లు కృషి చేయాలని డీఈఓ డాక్టర్ శేఖర్ కోరారు. తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ మాస్టర్ల అడ్వాన్స్ కోర్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఉన్న పాఠశాలలో విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో నడుచుకుంటున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి జయరాం ఆధ్వర్యంలో మహాత్ముడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర శిక్షణా శిబిర అధికారి శివనాగి రెడ్డి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. తిరుపతి, చిత్తూరు జిల్లా నుంచి విచ్చేసిన స్కౌట్స్ మాస్టర్లకు సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్ ఎం.ఎం.రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పిరెడ్డి, రాష్ట్ర నిర్వాహక సహాయ కమిషనర్ కోటేశ్వరరావు, బాలిప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకటముని, హెచ్‌ఎం మురళి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు



ఆందోళన చేపట్టిన సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు

తిరుపతి అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం ద్వారా కార్మికులు రోడ్డున పడుతారని సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు ఆందోళన చేపట్టారు. బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. టీడీపీ కూటమి సర్కారు జోక్యం చేసుకోవాల్సి ఉందని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విశాఖ ఉక్కు పరిశ్రమను తరలిస్తే ఊరుకోమని చెప్పిన నేతలు, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ అడ్డుకోవడానికి రాష్ట్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మద్యం షాపునకు మూడు దరఖాస్తులు

తిరుపతి క్రైమ్: ప్రభుత్వం విడుదల చేసిన నూతన పాలసీలో జిల్లాలో మొదటి రోజు మూడు దరఖాస్తులు వచ్చినట్లుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాత్రమే ఈ మూడు దరఖాస్తులు అందినట్లు చెప్పారు.

పితృదేవతలకు పిండప్రదానం



తర్పణాలు వదులుతున్న భక్తులు

తిరుపతి కల్చరల్: భాద్రపద మాసం బహుళ పాడ్యమి నుంచి మహాలపక్షాల నేపథ్యంలో చివరి రోజైన బుధవారం అత్యంత పవిత్రమైన మహాలయ అమావాస్య రోజున కపిలతీర్థంలో చనిపోయిన పితృదేవతలు, బంధువులకు పిండ ప్రధాన పూజలు నిర్వహణతో సందడి నెలకొంది. మహాలయ అమావాస్య నాడు మరణించిన తల్లిదండ్రులు, బంధువులకు పిండ ప్రదానం చేయడం ద్వారా వారి ఆత్మకు శాంతి కలుగుతుందని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో శ్రీకపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీకపిలేశ్వరాలయ ఆవరణలో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం వరకు పిండప్రదాన పూజలు సాగాయి. కపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సంఘం గౌరవ సలహాదారుడు రాజేష్, అధ్యక్షుడు అన్నదాన అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో సమస్యల పరిష్కారం

రామచంద్రాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు చక్కని వేదికలని జాతీయ మానిటరింగ్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, మోహన్ వేలు అన్నారు. బుధవారం మండలంలోని అనుప్పల్లి, నెత్తకుప్పం, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ గ్రామసభల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మలత, ఈఓపీఆర్డీ దేవిక, ఏపీఎం గురుమూర్తి, ఏపీఓ హంసవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

తిరుపతి (అలిపిరి) : తిరుపతి ఎస్‌బీఐ జోనల్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు గాంధీ జయంతి సందర్భంగా బుధవా రం తిరుపతి నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. నగర పరిశుభ్రత కోసం ప్రతినిత్యం శ్రమిస్తున్న కార్మికుల సేవలు మరువలేనివని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గాంధీ అడుగుజాడల్లో పయనిద్దాం

చంద్రగిరి(తిరుచానూరు): వేగంగా విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న తిరుపతి నగరంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన నారాయణాద్రి ఆస్పత్రి సమీపంలో సుమారు 400 మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో చెత్తాచెదారాలన్నీ దిబ్బలుగా ఉండేవన్నారు. స్థానిక ప్రజలకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక జ్వరాలు సోకి ఇబ్బంది పడేవారని, భూగర్భ జలాలు కలుషితమవుతూ ఉండేవని తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో సుమారు 20 రోజుల పాటు కార్మికులు ఎంతో శ్రమించి 2 వేల టన్నులు చెత్తను 600 ట్రిప్పులతో ఈ ప్రాంతం నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఇలాగే వదిలేస్తే మరోసారి చెత్తను వేస్తారనే ఉద్దేశంతోనే, ఇక్కడ అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ చెత్త పడేయాలని చూస్తే భారీగా జరిమానాలు ఉంటాయని ఆయన సున్నితంగా హెచ్చరించారు. ఆయనతో పాటు జేసీ శుభం భన్సల్, జిల్లా అధికారులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఇతర అధికారుల, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముదికుప్పం రూప మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పాకాలలో...

పాకాల : స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.తులసీరామన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు.

ఘనంగా టాస్క్‌ఫోర్స్‌లో..

తిరుపతి మంగళం: తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ ఎల్.సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

తిరుపతి కల్చరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు ఆధ్వర్యంలో బుధవారం గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయం వద్ద పేద మహిళలకు వస్త్రదానం, పేదలకు అన్నదానం నిర్వహించారు. దీనికి ముందు గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.



మహాత్ముడికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

దివ్యాంగులకు అల్పాహారం

తిరుపతి కల్చరల్: గాంధీ జయంతి సందర్భంగా గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం పాస్ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు.

భాకరాపేటలో..

భాకరాపేట : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం బృందావనం వద్ద స్వచ్ఛత, పరిశుభ్రతపై పంచాయతీల వారీగా పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో..

తిరుపతి తుడా: ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడవాలని ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ తెలిపారు. మెడికల్ కళాశాలలో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో..

తిరుపతి రూరల్: తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ సంతోషరావు, ఉద్యోగులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మహాత్ముడి సిద్ధాంతం.. యువతకు మార్గదర్శకం

తిరుపతి సిటీ: జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు యువతకు మార్గదర్శకమని వీసీ వి ఉమ తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మహిళావర్సిటీలో ఆమె బోధన, బోధనేతర సిబ్బందితో కలసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంస్కృత వర్సిటీలో, ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్, ఎస్పీడబ్ల్యూ కళాశాలల్లో గాంధీజీ జయంతి నిర్వహించారు.

ఎస్వీయూలో..

ఎస్వీయూ గ్రంథాలయం ఎదుట గల రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ఎస్వీ వెటర్నరీ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిరస్మరణీయులు

తిరుపతి తుడా: జాతిపిత గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయమని తుడా ఉపాధ్యక్షుడు మౌర్య అన్నారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో, కార్పొరేషన్ కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అధికారులు ఉన్నారు.

రుయా ఆస్పత్రిలో..

రుయా ఆస్పత్రి ఆవరణలో వైద్యులు మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పెరేడ్ గ్రౌండ్‌లో..

తిరుపతి గాంధీ రోడ్డు: పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు గాంధీకి ఘన నివాళులు అర్పించారు. అలాగే భారతీయ జనతా పార్టీ నేతలు తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

టీటీడీ పరిపాలనా భవనంలో..

తిరుపతి(అలిపిరి): టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో గాంధీ చిత్రపటానికి టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పుష్పాంజలి ఘటించారు.

దుప్పట్ల పంపిణీ

తిరుపతి కల్చరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని తిరుపతి సిటీ చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం రుయా ఆస్పత్రిలోని రోగులు, అలిపిరి పరిసరాలల్లో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దీనికి ముందు రుయా ఆస్పత్రిలో సిటీ చాంబర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.



తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో



నగర పాలక సంస్థ కార్యాలయంలో..



మహిళలకు వస్త్రదానం చేస్తున్న డాక్టర్ పీసీ రాయులు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,300 మంది స్వామివారిని దర్శించుకోగా, 21,884 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.23 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, లేని వారికి 12 గంటల్లో దర్శనం అవుతుండగా, ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

చంద్రగిరిలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

చంద్రగిరి: చంద్రగిరిలో విచ్చలవిడిగా బుధవారం మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మండలంలో మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారుల సీలు వేసి మూసివేశారు. కానీ బుధవారం చంద్రగిరి టవర్‌క్లాక్ సమీపంలోని ఓ దుకాణంలో, కొత్తపేటలోని ఓ దుకాణంలో విచ్చలవిడిగా మద్యం విక్రయించారు. దృష్టి సారించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.